# తాతగారు


డా॥ తాడేపల్లి పతంజలి

**నాకు ఆ పని చేసే ఆయనను ఎప్పుడూ గౌరవించాలనిపించేది.**

***

పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా అన్నట్టుగా సాధారణ అపార్ట్‌మెంట్లలోని జీవాలు కూడా అంతే. ఏవో ఇళ్ళు కాని ఇళ్ళలో, బతుకు కాని బతుకు బతుకుతుంటారు. నీళ్ళకు, గాలికి, వెలుతురికి మొహం వాచిపోయే మా అపార్ట్‌మెంట్ వాసుల్లో తాతగారు నన్ను బాగా ఆకర్షించారు.

మా అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో ఉంటారాయన. వయస్సు ఇతరులు దగ్గులు నేర్పలేనిది. అయినా అప్పుడప్పుడు దగ్గుతూ కన్పిస్తుంటారు. ఎవడి కొంప అనే జైలు గదిలో పగలు రాత్రీ తలుపులు బిడాయించుకొనే మాకు అందరం ఒక చోట చేరటమనేది సొసైటీ మీటింగులవంటి అరుదయిన సందర్భాలలో కలిగేది. తాతగారి మొదటి పరిచయం ఇటువంటి సందర్భంలోనే మొదటిసారి నాకు కలిగింది.



''బిల్డర్ మనకు లిఫ్ట్ పెట్టడం లేదు. కనుక ఈ విషయం గూర్చి మాట్లాడుకోవాలి. రాత్రి పది గంటలకి అందరూ మేడ మీద ఓపెన్ ప్లేస్ లోకి రండి'' బిల్డర్ హేండోవర్ చేయని అపార్ట్‌మెంట్‌కు మేము తాత్కాలికంగా ఏర్పరచుకొన్న సొసైటీ సెక్రటరీ నోటీస్ పంపించాడోసారి. నాకు ఇటువంటి మీటింగులకు వెళ్ళటం అలవాటు లేదు.

కాని రాత్రి తొమ్మిది నలభై అయిదుకు కాలింగ్ బెల్ అదేపనిగా మోగింది ఓ నిమిషంపాటు. ఇక పడుకొందామని నిద్ర రావటానికి తెలుగు సినిమా వీక్లీ తిరేస్తున్న నేను 'ఎవరో చూడు అన్నాను' భార్యామణితో. పుట్టింటివారు పెట్టిన నగను చూసి మురిసిపోతున్న ఆమె 'నాన్నా సాగర్ చూడమ్మా ఎవరొచ్చారో' అని నా ఆర్డర్ పాస్ ఆన్ చేసింది. ఇంగ్లీషు మీడియంలో ఏడవ తరగతి చుదువుతున్న వాడు మా కంటే రెండాకులు ఎక్కువ చదివినవాడు. ఇంగ్లీషు చందమామ చదువుకొంటున్న చెల్లెలు శ్రీలక్ష్మితో 'చూడవే లక్ష్మీ ఎవరో' అంటూ అమ్మ ఆర్డర్ పాస్ ఆన్ చేశాడు. శ్రీలక్ష్మి ముక్కుతూ, మూల్గుతూ వెళ్ళనని మొరాయించింది.

ఇంతలో బజర్ కర్ణకఠోరంగా మళ్ళీ అదేపనిగా సైరన్‌లా మోగింది. భరించలేకపోయాను. ''అబ్బా ఎవడ్రా అది ఆ మాత్రం కామన్‌సెన్స్ ఉండక్కర్లా ఛీ..ఛీ మనిషన్నవాడికి కొంచెం బుద్ధి జ్ఞానం ఉండాలి'' అనుకుంటూ నేనే లేచి తలుపు తీసాను. నా మాటలు తలుపు అవతల ఉన్న సెక్రటరీ చెవిన పడ్డట్టే ఉన్నాయి. అసలే నల్లగా ఉన్న ఫేసు మరింత మాడిపోయినట్లనిపించింది. ''ఇ హ్హి...హ్హి... హ్హి...హ్హి'' అని రాని నవ్వు తెచ్చుకొంటూ ''లోపలకి రండి'' అని ఆహ్వానించాను.

''అక్కర్లేదులేండి నాకు బుద్ధి జ్ఞానం ఉన్నాయి. ఎదుటివాళ్ళలో కూడా అవి ఉండాలని, టైమ్ సెన్స్ ఉంటుందనే ఆశతో మళ్ళీ పిలవటానికి వచ్చాను. పది గంటలకి మీటింగ్'' అంటూ నేనూ సారీ చెబుతున్నా వినిపించుకోకుండా చరచరా వెళ్లిపోయాడు.

తలుపు దగరగా వేసి ''నీవల్లే ఇదంతా వచ్చింది. వెంటనే తలుపు తీస్తే మాట అనకా పడకా ఉండేవాడిని కదా!'' అని మా ఆవిడతో విసుగ్గా అన్నాను. ''ఆ పొద్దున్నుంచి తీరిక లేక చస్తున్నాను. ఎల్లుండి పెళ్ళికి వెళ్ళాలికదా! మా వాళ్ళు చేయించిన నెక్లెసు మెరుగు పెట్టాలా వద్దా అని చూస్తున్నాను. ఏరా సాగర్ నువ్వు తీసి ఉండిచావచ్చు కదా! నీ వల్ల నాకు మాటలు వచ్చాయి'' అని మా ఆవిడ తన కోపాన్ని కొడుకు మీదికి తిప్పింది. పనిలో పనిగా ''నువ్వు నాకు నెక్లెసు చేయించలేదు. మా వాళ్ళే చేయించారు'' అని ఒక ఎత్తిపొడుపు కూడా నెక్లెసు పదాన్ని నొక్కుతూ వ్యంగ్యంగా అంది.

''ఒరేయ్ సాగర్! మళ్ళీ నువ్వు చెల్లిని ఏమీ అనకు అంతా నా ఖర్మ'' అంటూ వాకిలి తలుపు ఉక్రోషంతో గట్టిగా వేసి మేడ మీద మీటింగ్ దగ్గరికి వెళ్ళాను. మీటింగ్‌లో ఒక పదిమంది దాకా ఉన్నారు.

వాళ్ళని ఫోటో తీస్తూ తాతగారు కనిపించారు. తాతగారి మొదటి పరిచయం అక్కడే. ''అబ్బే ఎందు కండి వద్దండి'' ఇలాంటి మొహమాటపు వ్యాఖ్యానాలు వినవచ్చాయి ఫోటో తీయించుకొంటున్న మా వాళ్ళ దగ్గరనుండి.

''మన సమావేశానికి సాక్ష్యం ఈ ఫోటో మనం ఎవరం అడగకుండానే ఫోటో తీస్తున్న తాతగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నా అభినందనలతో మీరందరూ జతగలిపి చప్పట్లు కొట్టాల్సిందిగా కోరుతున్నాను'' మా అపార్ట్‌మెంట్ సెక్రటరీ సందు దొరికింది కదా అని రాజకీయ నాయకుడి లెవెల్లో ఉపన్యాసం చెప్పాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

తాతగారు పెళ్ళికొడుకులా సిగ్గుపడ్డట్టు కొంచెం పాటి వెన్నెల వెలుగులో నాకు కనిపించింది. ఆయన చేతులతో చేతులు కలిపి అభినందించాను ప్రత్యేకంగా.

ఆ తర్వాత కూడా చాలాసార్లు బిల్డరు కల్పిస్తున్న అసౌకర్యాలపట్ల తరచూ మేమందరం అసంతృప్తికి గురికావటం, మీటింగులు పెట్టడం, తాతగారు ఫోటోలు తీయడం సర్వసాధారణమయింది.

గణపతి నవరాత్రులు మా అపార్ట్‌మెంట్ లో నిర్వహిస్తున్నప్పుడు తాతగారిమీద అభిమానం మరింత రెట్టింపయింది. ప్రతిష్ఠాపన జరిగిన దగ్గర నుంచి పూజారిగారిని, ప్రసాదాల్ని, రకరకాల భంగిమలలో తాతగారు ఫోటోలు తీసేవారు. ఫోటోలో పడుతుందని, ఇంటి దగ్గర్నుంచి ప్రసాదాన్ని భారీగా తెచ్చి, ఫోటో తీసే సమయంలో ప్రసాదాల వెనుకగా నిలబడటం కొంతమంది చేసారు. ఈ రకంగా కూడా భారీప్రసాదాల మార్పుకి తాతగారు కారకులయ్యారు.

గణేశ్ ఉత్సవాల సందర్భంగా మా అపార్ట్‌మెంట్ వాసుల మధ్య పోటీలు పెట్టారు. మొదట కుర్చీలాట. ఉత్సాహవంతుడైన ఒక యువ ఫ్లాట్ ఓనరు తన ఇంట్లోంచి తెచ్చిన టేప్ రికార్డర్‌తో ఆన్, ఆఫ్ డ్యూటీలు నిర్వహిస్తూ కుర్చీలాటకు సహకరిస్తున్నాడు.

కుర్చీల చుట్టూ రంగు రంగుల, మెరిసె పట్టు చీరలతో పంజాబీ డ్రస్సులతో తిరుగుతున్న యువతులను చూస్తూ ఒళ్ళు తెలియని పారవశ్యంతో ఉన్న ఆ యువకుడు టేప్ రికార్డర్ ఆఫ్ చేయటం ఆలస్యం చేస్తుంటే తాతగారు ఆ యువకుడి దగ్గరకు వెళ్ళి ''బాబూ! నీ డ్యూటీ నన్ను చేయమంటావా?'' అని అడిగారు.

''మీరా! ఈ వయస్సులోనా! బాగుండదు వద్దులేండి'' ఆ యువకుడు గబుక్కున అనేసి వెంటనే తనన్న మాటల్లో వేరేఅర్థం తోచిందికాబోలు ''సారీ'' అన్నాడు.

''ఫరవాలేదు అన్ని సారీలు అన్ని శారీలు ఒక్కటే మన ఇంట్లో వాళ్ళ శారీ మీద మురికి పడితే ఎలా ఫీలవుతామో ఇతరులు కూడా అంతే వాళ్ళ శారీల మీద చూపుల మురికి ఫీలవుతారు. జాగ్రత్త బాబు జాగ్రత్తగా చూసుకో. అదే టేప్ రికార్డర్‌ని'' అని తాతగారు నెమ్మదిగా అతనికి మాత్రమే వినబడేలా చాలా చిన్న గొంతుతో వాయిస్తుంటే, యువఫ్లాట్ ఓనర్ కుదేలయ్యాడు. వాళ్ళిద్దరికి బాగా దగ్గరగా ఉన్న నాకు ఆ మాటలన్నీ వినిపించాయి. నేను పాముని కాకపోయినా, నా చెవులు పాము చెవులు.

ఆ సాయంత్రం ఆటలన్నీ ముగిసి ప్రసాదాలందరూ తీసుకొని వెళ్ళిన తర్వాత, వీలు చూసుకొని ఎవరూ లేకుండా తాతగారి దగ్గరకు వెళ్ళి ''నిస్వార్థంగా ఫోటోలు తీసే మీ చేతులకు, వాత ఎలా పెట్టాలో తెలిసిన మీ మాటలకు అభినందనలు'' అన్నాను. తాతగారు నవ్వారు వేదాంతిలా. ''ఆహా నన్నే కదా పొగుడుతున్నావ్ ఇంకాస్త పొగుడు'' అన్న లెవల్లో కాకుండా, మంచి పనులు చేసి కూడ పొగడ్తలని పట్టించుకోని ఆయన్ని చూస్తే గౌరవం మరింతగా పెరిగింది.

ఆ రాత్రి నిద్ర పట్టక దొర్లుతున్న నాకు అద్భుతమైన ఆలోచన వచ్చింది. సుఖంగా నిద్ర పోతున్న మా ఆవిడని లేపాను. '' ఏంటండి'' అని మా ఆవిడ విసుగ్గా లేచింది.

''ఇలా చేస్తే ఎలా ఉంటుందంటావ్?'' అడిగాను.

మా ఆవిడ నా మొఖంకేసి తేరిపారా చూసి, తన మంగళ సూత్రాన్ని కళ్ళకద్దుకొని, ఇష్ట దైవాన్ని ప్రార్థించుకొంది. ''ఉండండి ఒక్కనిముషం'' అని పక్క దిగబోయింది. ''ఎక్కడికి?'' ప్రశ్నించాను.

''షిర్డినుంచి ఇవాళే పోస్టులో వచ్చింది బాబాగారి విబూది తెస్తానుండండి'' అంటూ వెళ్ళబోతుంటే, చేయిపట్టుకొని ఆపాను. ''పిచ్చిదానా! మనమిద్దరం పిచ్చోళ్ళమే. ఆ మాటకొస్తే ఆప్యాయత ఉన్న భార్యభర్తలిద్దరూ ఒకరికొకరూ పిచ్చోళ్ళే. నాకు నీ మీద, నీకు నా మీద పిచ్చి. అంతకు మించి ఏ పిచ్చి మనకు లేదు. రాదుగాని నాకు ఒక మంచి ఆలోచన వచ్చింది. మన అపార్ట్‌మెంట్ తాతగారిని, రేపు భోజనానికి పిలిచి బట్టలు పెడితే ఎలా ఉంటుందంటావ్?'' అన్నాను.

''ఏం మిమ్మల్నంతగా ఆకర్షించాడా, ఏం ఏమంత గొప్పతనం ఉంది ఆయనలో'' మా ఆవిడ ఆవులిస్తూ అంది. ''ఎంతవుందుంటారే ఆయన్లాగా'' అంటూ తాతగారి కేస్ స్టడీని మొదట్నుంచి మా ఆవిడకి వినిపించి ''రేపు నా పుట్టిన్రోజు సందర్భంగా ఆయన్ని ఇంటికి పిలుద్దామనుకొంటున్నాను. అఫ్‌కోర్స్ నీ సహకారం లేనిదే పిలవలేననుకో ఏం చేద్దామంటావ్'' అన్నాను.

''ఎవడి పిచ్చి వాడికానందం అలాగే పిలుచుకోండి. తెల్లారేదాక నన్ను నిద్ర లేపకండి ఈ సారి లేస్తే నాకు మళ్ళీ నిద్ర పట్టదు. రేపు నిద్ర మత్తులో చేసిన నా వంట తిన్న తర్వాత మీకు, మీ అతిథికి రెండు మూడు రోజులు అజీర్తితో, అనారోగ్యంతో నిద్ర పట్టకపోవచ్చు'' అని నవ్వుతూ మా ఆవిడ దుప్పటి బిగించింది.

తెల్లారిలేచిన తర్వాత నా ఆహ్వానానికి తాతగారు మోహమాటపడటం, తరువాత నా బలవంతం మీద అంగీకరించటం, మా ఆవిడ వండిన కమ్మటి భోజనం తినటం అన్నీ వరుసగా జరిగాయి.

భోజనం తర్వాత ఆయన్ని కుర్చీలో కూర్చోబెట్టి, బట్టలు పెట్టి మా దంపతులిద్దరూ నమస్కరిస్తుంటే, ఆయన కళ్ళు తడవటం గమనించాను. ''సుఖంగా ఉండండి నాయనా'' అని ఆశీర్వదించారు. ఇంతలో మా అబ్బాయి సాగర్ ''డాడీ ఒక్క ఫోటో తీసుకొందామా'' అన్నాడు.

''మనకి కెమెరా లేదు కదరా'' అన్నాను.

''తాతగారి దగ్గర ఉంది కదా'' అన్నాడు ఆయన మెళ్ళో వేలాడుతున్న కెమెరాను చూస్తూ.

''దీనితోటా వద్దు బాబూ'' అన్నారు తాతగారు నింపాదిగా. ప్రతి చిన్న విషయానికి అడగకుండానే ఫోటోలు తీసే ఆయన మా వాడు నోరు తెరిచి అడిగితే వద్దనటం, కొంచెం బాధేసింది నాకు.

''బాబూ! ఇంత ఆప్యాయత చూపిస్తున్న మిమ్మల్ని మోసం చేయటం నాకు ఇష్టం లేదు. నా కెమెరా ఫ్లాష్ వెలుగుతుందిగాని ఫోటో తియ్యదు'' తాతగారు చెప్పారు. ''జీవితంలో ఎనభయ్యవ రీలు దగ్గరికి వచ్చాను గాని, ఎనభై రూపాయలు పెట్టి రీలు కొనుక్కొనే దమ్ము ఈ పెన్షనర్‌కి లేదు. ప్రైవేటు ఉద్యోగంలో అరకొరా సంపాదిస్తూ, తన భార్యా బిడ్డలతో నన్ను కూడ పోషించే కొడుకిని నా సరదాలకి డబ్బు అడగటం ఇష్టం లేదు. అలాగని ఎప్పట్నించో నాతో పాటున్న కెమెరాను వాడుకోకపోవటం ఇష్టంలేదు.'' తాతగారు చెప్పటం ఆపారు.

''మరి ఈ రెండు నెలలనుంచి తీసిన ఫోటోల సంగతి ఎవరూ అడగలేదా?'' అడిగాను.

''స్టాక్ డైలాగ్ ఉందిగా ఇంకా రీలు కడగలేదు'' తాతగారు నవ్వుతూ అన్నారు.

***

ఇప్పుడు కూడా తాతగారిని చూస్తే గౌరవించకూడదని నాకు అనిపించటం లేదు.

